క్లుప్తంగా

గ్రామాల్లో ఉపాధి పనులు



పనులు పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ ఆనందరావు

డుంబ్రిగుడ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా ఉన్న 18 పంచాయతీల్లో జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉపాధి పనులు కల్పించారు. అందులో భాగంగానే సోమవారం కండ్రుం పంచాయతీ కేంద్రంలో భూమి చదును పనులను వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు పరిశీలించారు. ప్రభుత్వం ఉపాధి పనుల కల్పనతో గ్రామాల్లో వలసలు తగ్గాయన్నారు.

జగనన్న విద్యా కానుక పంపిణీ



టీచర్లకు విద్యా కానుక కిట్లు అందజేస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: ప్రభుత్వం విద్యార్థులకు పంపిణీ చేస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లను సోమవారం ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం ముందుగానే ఈ ఏడాది అన్ని పాఠశాలల విద్యార్థులకు కిట్‌లను అందించేందుకు వీలుగా మండల కేంద్రాలకు సామగ్రిని సరఫరా చేసిందన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, సర్పంచ్ సీతయ్య

అనంతగిరి: మండలంలోని కొత్తూరు పంచాయతీ గంగవరం నుంచి కారెగెడ్డ వరకు ఎస్ఆర్ఈజీఎస్‌లో సుమారు రూ.6 లక్షలతో రహదారి, గంగవరంలో బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణ పనులకు ఎంపీపీ శెట్టి నీలవేణి, సర్పంచ్ సారా సీతయ్య, సోమవారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హాయంలోని అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రజలందరూ వీటిని గమనిస్తున్నారన్నారు. సంక్షేమపాలనకు నాంది పలికిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి గిరిజనులంతా రుణపడి ఉన్నారన్నారు. కో–ఆప్షన్ సభ్యుడు మదీనా, రాంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



పీవో సూరజ్‌గనోరేకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రంపచోడవరం: అంగన్‌వాడీ కార్మికులకు కనీస వేతనాలు రూ.26వేలకు పెంచాలని, టీఏ బిల్లులు ఇవ్వాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్మికులకు గ్రాడ్యూటీ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేకు అందజేశారు. ఆయన స్పందించిన సమస్యలను యంత్రాంగం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

మన్యంలో భిన్న వాతావరణం



జీకే వీధిలో శీతల వాతావరణం

గూడెంకొత్తవీధి: మన్యంలో కొద్ది రోజులుగా భిన్నమైన వాతావరణం నెలకొంటోంది. ఉదయం పూట మంచు పడుతోంది. మధ్యాహ్నం వరకూ ఎండ కాస్తోంది. కాసేపటికి మబ్బులు కమ్మేసి భారీ వర్షం కురుస్తోంది. సాయంత్రం అయ్యేసరికి చలి తీవ్రత అధికంగా ఉంటోంది. ఒకే రోజులో మూడు కాలాలనూ ప్రస్తుత వాతావరణం తలపిస్తోంది.

గిరిజనుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



లక్కవరపేటలో గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

గూడెంకొత్తవీధి: గిరిజనుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. లక్కవరపేట సచివాలయం పరిధిలోని సురవరం, కొత్తవలస, లక్కవరపేట బోయపాలెం తదితర గ్రామాల్లో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయా గ్రామాల్లో 240 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఏజెన్సీ అభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందన్నారు. సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ బోయినకుమారి, వైస్ ఎంపీపీ దేవుడు, మండల ఇన్‌చార్జి పోతురాజు, కృష్ణమూర్తి, సర్పంచ్ వీరేంద్రప్రసాద్, నాయకుడు గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమం

అరకులోయ రూరల్: ఇంటింటికి సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలో బస్కి పంచాయితీ దేవరపల్లి,బొండగూడ గ్రామల్లో సోమవారం సందర్శించి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 330 గడపలను ఆయన సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారన్నారు. గిరిజనుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. గతంలో లేని విధంగా ఏజెన్సీలో అభివృద్ధి జరుగుతోందన్నారు. ఎంపీపీ ఉషారాణి, పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమర్, సర్పంచ్ పాడి రమేష్, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, వైస్ సర్పంచ్ రాంచందర్ , నాయకులు రఘనాథ్, తిరుపతి, బాలరాజు, సాంబ, బాబూరావు, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

భూపట్టాలపై సర్వే



తహసీల్దార్ ప్రసాద్

చింతపల్లిరూరల్: మండలంలో డీ–ఫారం పట్టాలు కలిగిన గిరిజన రైతుల వివరాలపై సర్వే చేపట్టామని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు.వీఆర్‌వోలు, బూత్ లెవల్ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డీ–ఫారం పట్టాలు కలిగి భూములు సాగు చేసుకుంటున్న గిరిజనుల వివరాలపై సర్వే నిర్వహించి పూర్తిస్థాయి పట్టాలు పంపిణీ చేసేందుకు ఉన్నత అధికారులకు నివేదికలు పంపిస్తున్నామన్నారు. భూమి సాగు చేస్తున్నప్పటికి డీ–ఫారం పట్టాలు కుడా లేనివారి వివరాలు సేకరిస్తున్నామన్నారు. ఫారం –6,7 పీవీటీజీల ఓటర్ల గుర్తింపు ప్రక్రియను వారం రోజుల్లోగా పూర్తి చేసి ఉన్నత అధికారులకు అందజేయనున్నట్టు తెలిపారు. వీఆర్‌వోలు, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

పూజాసామగ్రి వేలం ఖరారు

దేవీపట్నం: గండిపోశమ్మ ఆలయంలో కొబ్బరి చెక్కలు, పూజాసామగ్రి, అమ్మవారి ఫోటోల విక్రయాలు, చీరలు, రవికెలు తీసుకును అనుమతి కోసం టెండర్‌లు ఖరారు చేసినట్టు ఆలయ ఈఓ జి.వి.లక్ష్మీకుమార్ సోమవారం తెలిపారు. ఏడాది కాలానికి టెండర్‌దారులు విక్రయించునే అవకాశం ఉందని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట



కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టలో భక్తులు

వై.రామవరం: మండల లోతట్టు ప్రాంతమైన చింతలపూడి పంచాయతీ దుమ్మిలగడ్డ గ్రామంలో సోమవారం కనకదుర్గ, నాగశివలింగ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అడ్డతీగల గ్రామానికి చెందిన పవనగిరి ఆలయ వ్యవస్థాపకులు, తణుకు వెంకటరామయ్య, ఆయన సతీమణి విజయలక్ష్మీల ఆధ్వర్యంలో వేద పండితుల సహకారంతో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాగశివలింగాన్ని పవనగిరి అధినేత, కనకదుర్గమ్మ విగ్రహాన్ని ఒంగోలుకు చెందిన దైవ భక్తులు శివప్రసాదుల ఆర్థిక సహాయంతో బహూకరించారు. ఈ సందర్భంగా హోమాలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. పవనగిరి అధినేత వెంకట్రామయ్య మాట్లాడుతు లోకకళ్యాణం కోసం ఏజన్సీ ప్రాంతంలోని మారుమూల గ్రామాల్లో ఇంటువంటి దైవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సర్పంచ్ రాజమ్మకు నివాళి



సర్పంచ్ రాజమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కూనవరం: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కట్టం రాజమ్మ మృతి పంచాయతీ ప్రజలకు తీరని లోటని ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ అన్నారు. ఆమె స్వగ్రామం టేకులబోరులో భౌతిక కాయాన్ని వైఎస్సార్‌సీపీ మండల కమిటీతో పాటు సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు, సీజీఎస్ ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్, గుజ్జాబాబు, భరతమూర్తి, కొమ్మాని మోహన్‌రావు, కరకలక్ష్మీ, జోడెలక్ష్మీ, ఎలిపె రమేష్, వెంకట్రావు, పూల శ్రీను, జి.ప్రేమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

మోదమ్మ తల్లి ఉత్సవాలకు ఏర్పాట్లు



ఆలయానికి రంగులు వేస్తున్న గ్రామస్తులు

పెదబయలు: మన్య ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ తల్లి ఉత్సవాలకు పెదబయలు మోదకొండమ్మ తల్లి ఆలయం ముస్తాబవుతోంది. ఈ నెల 28 నుంచి 30 తేదీ వరకు ఉత్సవాల నిర్వహణకు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మజ్జి చంద్రబాబు ఆధ్వర్యంలో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఉత్సవాలను విజయవంతం సహకారం అందించాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ దృష్టికి కమిటీ నాయకులు కోరారు. ఏటా పెదబయలు మోదమాంబ వర్తక సంఘం, ఆదివాసీ వర్తకుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలంకరణ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.ఉత్సవ కమిటీ నాయకులు, సీతగుంట పంచాయతీ నాయకులు, వర్తక సంఘం నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

సీలేరు: మారెమ్మతల్లి సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో విన్నర్స్‌గా సీలేరు–బి జట్టు నిలవగా, రన్నర్‌గా సీలేరు–ఎ జట్టు నిలిచింది. గత నెల 29న ప్రారంభమైన క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. సీలేరు యంగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి 22 జట్లు పాల్గొన్నాయి. విజేత జట్లకు నిర్వాహకులు ట్రోఫీలు అందించారు. ఏపీ జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ క్రీడాకారులు ఎంతో నైపుణ్యత ప్రదర్శించారన్నారు. వీరికి ప్రోత్సాహం అందిస్తే రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకువస్తారన్నారు. సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ సురేష్, ఎస్ఐ రామకృష్ణ, ఎంపీటీసీ సాంబమూర్తి, సర్పంచ్ వల్లీ ప్రసాద్ తదితరుల చేతుల మీదుగా క్రీడాకారులకు బహుమతులు అందించారు.

టేకు దిమ్మలు తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు



బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న టేకుదిమ్మలు

కూనవరం : ద్విచక్రవాహనాలపై అక్రమంగా టేకు దిమ్మలు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను స్థానిక అటవీరేంజ్ అధికారి మోహిని విజయలక్ష్మి తన సిబ్బందితో కలిసి మాటువేసి పట్టుకున్నారు. కూనవరం అటవీ రేంజ్ పరిధిలోని తాటిలంక బీటులో సోమవారం చోటు చేసుకుంది. రేంజ్ ఆఫీసర్ కథనం ప్రకారం వినాయకపురం, విస్సాపురం గ్రామాలకు చెందిన కొంతమంది ఆటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్టు అనుమానం రావడంతో గత నెల 25 నుంచి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో వీళ్ల పట్టుబడ్డారు. వినాయకపురం గ్రామానికి చెందిన ఇరప లక్ష్మయ్య, గొరిదేవి పేట గ్రామానికి చెందిన అమరవరపు రాము తెల్లవారుజామున ద్విచక్ర వాహనాలపై రూ.15వేలు విలువ చేసే టేకుదిమ్మలు తరలిస్తూ పట్టుబడ్డారు. ఆ టేకుదిమ్మలతో పాటు ద్విచక్ర వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నామని, డీఎఫ్ఓ ఆదేశాల మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

అసంపూర్తి పనులు పూర్తి చేయాలి

జి.మాడుగుల: మండలంలో పాలమామిడి పంచాయతీ పరిధిలో కొంతలం, వనభంగిపాడు గ్రామాల్లో సోమవారం సర్పంచ్ సురభంగి రామకృష్ణ పర్యటించారు. ఆయన మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాలను పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను కోరారు. ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాలు చేపట్టి అసంపూర్తిగా వదిలేశారన్నారు. సరకులను భద్రపరచుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అధికార యంత్రాంగం స్పందించి అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు చేపట్టేందుకు టెండర్లు ఆహ్వానించాలన్నారు. సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ రాములమ్మ, చిన్నతల్లి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు మోదకొండమ్మ ఘటాల ఊరేగింపు

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ పండగ జూన్ 6వ తేదీన జరగనున్న సందర్భంగా మంగళవారం అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలు ఊరేగింపు కార్యక్రమం ఉదయం 8 గంటలకు జరగనుందని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. గ్రామంలో ఊరేగింపు అనంతరం కోట బయట సతకంపట్టు వద్ద కొలువు ఏర్పాటు చేస్తారన్నారు. నెల రోజులు కొలువు అనంతరం తిరిగి ఆలయానికి ఘటాలు చేర్చడంతో అమ్మవారి పండగ పూర్తవుతుందన్నారు. కమిటీ సభ్యులతోపాటు భక్తులు పాల్గొనాలని కోరారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రాంబాబు, ఎంపీటీసీ విజయకుమారి

జి.మాడుగుల: మండల కేంద్రంలోని రామాలయం నుంచి చుట్టమెట్ట గ్రామం వరకు 1.50 కిలోమీటర్లు రూ.6లక్షలతో చేపట్టే మట్టి రోడ్డు నిర్మాణ పనులను సోమవారం సర్పంచ్ కిముడు రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు మత్స్యరాస విజయకుమారి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద మట్టి రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నామన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు గబ్బాడి సన్యాసిదొర, నాయకులు బంగార్రాజు, గంగాధర్, పాపిటిరాజు, వీఆర్‌పీ నాగలక్ష్మి, మత్స్య కొండమ్మ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈశ్వరమ్మ జాతర ప్రారంభం



పూజలు చేస్తున్న భక్తులు

చింతపల్లి: మండలంలోని లోతుగెడ్డ జంక్షన్‌లో సోమవారం ఈశ్వరమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం వరకు జాతర నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మంగళవారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

పూర్తయిన పింఛన్ల పంపిణీ



పింఛన్ అందజేస్తున్న వలంటీర్

రాజవొమ్మంగి: మండలంలో పింఛన్లను పంపిణీలో రాజవొమ్మంగి ప్రథమస్థానం సాధించినట్టు స్థానిక ఎంపీడీఓ బాపన్నదొర సోమవారం విలేకరులకు తెలిపారు. వలంటీర్లు వేకువజామునే ఇంటింటికి వెళ్లి వృద్ధులకు, వితంతు, దివ్యాంగులకు పింఛన్లను త్వరితగతిన అందజేయడం వల్లనే ఇది సాధ్యమయ్యిందన్నారు. మండలంలో 6,494 మందికి పింఛన్లు అందజేయాల్సి ఉండగా, ఇప్పటికే 6,403 మందికి పింఛన్లను అందజేసి 99.44 శాతం పూర్తి చేశామన్నారు.

యూటీఎఫ్ ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి మహేశ్వరరావు

రంపచోడవరం: స్థానిక యూటీఎఫ్ హోంలో సోమవారం ఆ సంఘ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కార్యకర్తలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో రంపచోడవరం, చింతూరు డివిజన్ పరిధిలోని యూటీఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై.విల్సన్‌బాబు, ప్రధాన కార్యదర్శి వి. మహేశ్వరరావు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్‌గా జిల్లా కార్యదర్శి కె.ఆదిరెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.మహేశ్వరరావు తదితరులు మాట్లాడారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం



డుంబ్రిగుడలోని గ్రంథాలయంలో చిన్నారులు



కూనవరంలోని విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు

డుంబ్రిగుడ: మండలంలోని వేసవి విజ్ఞాన శిరాన్ని సోమవారం డుంబ్రిగుడ స్థానిక శాఖ గ్రంథాలయంలో ప్రారంభించి విద్యార్థుల ద్వారా కథల పోటీలను నిర్వించారు. ఈ సందర్భంగా శాఖ గ్రంథాలయ అధికారి శెట్టి సునీత మాట్లాడుతూ విద్యార్థులు ఈ వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలనిమంచి నైపుణ్యతను పెంపొందించుకోవాలన్నారు.

కూనవరం: విద్యార్థులు గ్రంథాలయాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పలువు వక్తలు సూచించారు. స్థానిక గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని సీనియర్ సిటిజన్ డాక్టర్ వెంకయ్య ప్రారంభించారు. లైబ్రేరియన్ గోవిందరాజులు మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి జూన్‌నెల 11వ తేదీ వరకు విద్యార్థులకు కథలు, కథనాలు, సృజనాత్మక కృత్యాలు వంటి వాటిపై అవగాహన పెంపొందించనున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులను ఈ దిశగా ప్రోత్సాహించాల్సిందిగా కోరుతున్నామని తెలిపారు. ఉపాధ్యాయురాలు కె.భద్రమ్మ, ఎస్.సత్యానారాయణ, కృష్ణార్జునరావు, సుబ్బారావు, భూపేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



వై.రామవరం మండలం వలస గ్రామం సమీపంలో నిర్మిస్తున్న రోడ్డును పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

వై.రామవరం: మండలంలోని కోట గ్రామం నుంచి చింతలపూడి పంచాయతీ వలస గ్రామానికి సుమారు రూ.50లక్షలతో నిర్మిస్తున్న గ్రావెల్ రోడ్డు నిర్మాణాన్ని సోమవారం ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి తదితరులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం జరిగిన పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏజన్సీలోని శివారు గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబులు మండలంలోని గ్రామాల్లో రహదారుల కోసం ప్రభుత్వానికి తెలియజేశారన్నారు. ఇందులో భాగంగా మండలంలోని కోట, వలస గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణం జరుగుతోందన్నారు. మండల ఎగువ ప్రాంతంలో మరిన్ని రోడ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి స్పందించారన్నారు. సచివాలయాల కన్వీనర్లు మద్దికొండ బారతిబాబు, కరణం కనకరాజు తదితరులున్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పసుపులేటి బాలరాజు

గూడెంకొత్తవీధి: తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి పేదవానికి అన్ని రకాల సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తూ జవాబుదారీ తనంతో పని చేస్తూ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పసుపులేటి బాలరాజు అన్నారు. మండల కేంద్రంలో ఆయన సోమవారం స్థానికులతో మాట్లాడారు. పేదరికమే కొలమానంగా రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిదే నన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ తమ ప్రభుత్వం అధికారాన్ని చేజిక్కించుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

తప్పని ట్రాఫిక్ తిప్పలు



సంతలో స్తంభించిన ట్రాఫిక్

గూడెంకొత్తవీధి: ప్రతి సోమవారం గూడెంకొత్తవీధి మండలం ఆర్వీనగర్‌లో వారపు సంత జరుగుతుంది. సంతరోజున వ్యాపారులు ప్రధాన రహదారికి ఆనుకునే దుకాణాలు వేస్తుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అసలే ఇరుకైన రహదారిలో వ్యాపారులు సంతరోజున రహదారి పక్కనే దుకాణాలు వేస్తుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికి తోడు సంత రోజున ఆటోలు, ఇతర ప్రయివేటు వాహనాలు రహదారిపైనే అస్తవ్యస్తంగా నిలిపేస్తుండడంతో మరింత ఇబ్బంది ఎదురవుతోంది. దీంతో పాదచారులు, వారపుసంతకు వచ్చిన వారు అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని వారపు సంతరోజున ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఈప్రాంతీయులు కోరుతున్నారు.

గ్రామాల్లో రైతు సంఘాలతో చర్చలు

రంపచోడవరం: అగ్రో ఫారెస్ట్రీ ద్వారా గిరిజన చిన్నకారు రైతుల జీవనోపాధిని కార్బన్ ఫైనాన్స్ ప్రాజెక్టు ద్వారా మెరుగుపరచనున్నట్టు వరాహ టెరిటరీ మేనేజర్ ఎం.ఎస్.ఎన్. మూర్తి తెలిపారు. గిరిజన రైతుల, గిరిజన సంఘాల కోసం కార్బన్ ఫైనాన్స్ ప్రాజెక్టు అభివృద్ధికి వరాహా సంస్థ తరఫున జిల్లాలో మూడు రోజులు పాటు రైతులు, రైతు సంఘాలతో చర్చ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రంపచోడవరంలో–9న, చింతూరులో–10న, చింతపల్లిలో–11న ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అగ్రో ఫారెస్ట్రీ పద్ధతుల ను అవలంబించడం ఉత్తమైన పరిష్కారమని, కోల్పోయిన పర్యావరణ వ్యవస్థను పునరుద్ధరించగలదన్నారు. అనేక వ్యవసాయ పద్ధతులలో అగ్రో ఫారెస్ట్రీని అభ్యసిస్తున్న ప్రాంతాల్లో పంట ఉత్పాదకతను పంచడంలో, భూసారాన్ని మెరుగుపరడంలో కార్బన్ క్రెడిట్‌లను అభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.